# నిలువుదోపిడి!

"సీతాలూ! ఎంతసేపు సోకుసేసుకుంతావ్! బేగి తెవులు!" అన్నాడు సింహాద్రి చిరాగ్గా.

"సోకా పాడా! అయిపోనాది. సిటవాగు! కోక సుట్టుకుంతన్నా" అంది సీతాలు.

"ఏటొరే సిమ్మాద్రీ! ఏటా ఇసుగు? పెందిల నెగిసింది తడవు ఓటే నస! ఊదర గొడతన్నావు! సీతాలు ఊరక కూకుందేటి? సెక్కర పటాకీ నాగ ఇల్లంతా దిరిగి పనిసేస్తంది! కోడికూతకి ముందే నెగిసి కూడొండి పెట్టినాదా? నీకు తానానికి ఉడుకు నీళ్లెట్టి బావికాడ గుడ్డముక్కలు గుంజి ఆరేసినాది! నీ ముందలే సల్దికూడు కతిగి నెగిసింది సూస్తన్నావుగదా! అంది సింహాద్రి తల్లి మంగమ్మ.

"ఆలీసమైపోతాదని బయమే. బేగెల్లి సరుకు అప్పసెప్పాల... నేకుంటే సావుకారు సిందులేస్తాడు"

అత్తమ్మా! మావు బయలెల్తన్నాం... బొట్టిడు నెగిసాక ఆడికి ఉడుకు నీళ్లోసి బువ్వెట్టు! బేగి తిరిగొచ్చేత్తాము" అంది గుడిసెలోంచి బయటకు వస్తూ సీతాలు.

సింహాద్రి భార్యవంక ఒకమారు చూసి తోపుడు బండి నెట్టుకుంటూ ముందుకు కదిలాడు.

సింహాద్రికి నాలుగు చక్రాల తోపుడు బండి వుంది. గ్రామంలో పండ్ల కాయగూరల మూటలు, నిమ్మ, నారింజ, బత్తాయి, జామ, మొదలైన పండ్ల బుట్టలు, ఆకుకూరలు వగైరాలు తన తోపుడు బండి మీద వేసుకొని గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోవున్న పట్నం మార్కెట్‌కి తీసుకొని వెళ్లి అప్పగిస్తాడు. పట్నంలో సరకుల రవాణా వుంటే చేస్తాడు. తిరిగి వచ్చేటప్పుడు గ్రామంలో షావుకారు దుకాణానికి కిరాణా సరుకులు, తవుడు, చిట్టు, కోళ్ల దాణా వంటివి తీసుకొనివస్తాడు.

తోపుడుబండి మీద లోడు ఎక్కువగావున్న రోజున భార్యను తీసుకొని వెళ్తాడు. లేకుంటే సీతాలు గ్రామంలో వ్యవసాయ పనులకెళ్తుంది.

ఆ రోజు అదే విధంగా సీతాలు భర్తకు సహాయంగా పట్నం వెళ్లింది. వారు సరుకు అప్పగించి తిరిగి వస్తుండగా ఎదురుగా ఒక కారు అమిత వేగంగా దూసుకురావడం గమనించి ప్రమాదం పసిగట్టి సింహాద్రి తన భార్యను, బండినీ బలంగా ప్రక్కకు నెట్టాడు. వాడు తప్పుకునేలోపల కారువచ్చి గుద్దడంతో క్రింద పడి ప్రాణాలు వదిలాడు. కారు పదిగజాలు ముందుకెళ్లి ఆగింది. కారు నడుపుతున్న ఆమె క్రిందకు దిగివచ్చి ఘోరం కళ్లారా చూసి కంపించిపోయింది. సీతాలు ఈ సంఘటనకు నిర్ఘాంతపోయి అచేతనంగా భర్త శవం వద్ద కూలబడింది.

"తాను నిర్లక్ష్యంగా కారు నడపడం వల్ల

రావి-ఎన్-అవధాని

ఒక నిండు ప్రాణం బలైపోయింది. ఒక యిల్లాలి పసుపు, కుంకుమలు మట్టిలో కలిసిపోయాయి" అనుకుని సీతాలువంక చూసింది.

సీతాలుకి షాక్‌వల్ల నోటంట మాటరాలేదు.

ఆమె సీతాల్ని, పరిసరాలనూ ఒకసారి చూసింది. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. తప్పించుకు పోవడానికి అదే అదును అనుకొని వడివడిగా కారు వద్దకు వెళ్ళి, డ్రైవ్ చేసుకుంటూ ముందుకుసాగిపోయింది.

కారు వెళ్ళిపోవడం చూసి సీతాలు తేరుకుంది. దుఃఖం దిగమింగుకొంది - భర్త శవాన్ని తోపుడు బండి మీద వేసుకొని గ్రామం చేరుకుంది. గ్రామవాసులు, బంధువులూ విషయం తెలుసుకొని కోపోద్రిక్తులయ్యారు.

"కారు నెంబరు, రంగు చెప్పమ్మా పోలీసు రిపోర్టిద్దాం!" అన్నారు.

"ఏటి నాబం? నా పెనిమిటి తిరిగొత్తాడేటి? దినావూ పోలీసులెంట దిరగాల!" అంది సీతాలు.

"అట్టాగంటావేటి తల్లీ! తప్పుసేసినోల్లకు సిచ్చ పడాల! నీకు నట్టపరిగారం ఇయ్యాల!" అన్నారు ఆవేశంగా.

"యాగీ ఎట్టకండి! నాకు నెత్తురు కూడొద్దు" అంది సీతాలు. సీతాలు నిర్ణయాన్ని సమర్థించింది మంగమ్మ. దాంతో గ్రామప్రజలు శాంతించారు.

x x x

'ఎ టు జెడ్' హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వచ్చిన పారిశ్రామికవేత్తలను, వాణిజ్యవేత్తలను, పురప్రముఖులనూ సమావేశపర్చి తన అల్లుడు డాక్టర్ నందగోపాల్‌కి పరిచయం చేసాడు ధనంజయరావు.

డాక్టర్ నందగోపాల్ అందరికీ నమస్కరించి "మానవ శరీరం ఒక యంత్రం వంటిది! యంత్రంలోని అన్ని భాగాలు సవ్యంగా ఉంటేనే యంత్రం సాఫీగా పనిచేస్తుంది. యంత్రంలోని చిన్న స్క్రూ కాని, నట్టు, బోల్టు కాని లూజ్ అయితే యంత్రం సాఫీగా పనిచెయ్యదు! అశ్రద్ధ వహిస్తే యంత్రం చెడిపోతుంది. అందుకే తరచు చెకింగ్, ఆయిలింగ్ వగైరా చేయిస్తాం!"

"అదే విధంగా మానవ శరీరంలోని అన్ని అవయవాలూ సవ్యంగా పనిచేస్తేనే మానవుడు ఆరోగ్యంగా జీవించగలడు. అంటే వైద్యనిపుణులచేత తరచూ పరీక్షలు చేయించుకొని అవ




సరమైన జాగ్రత్తలు పాటించాలి."

"నేడు వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందింది. వివిధ శాఖల్లో ఆరితేరిన నిపుణులు ఉన్నారు. నేను, నా స్నేహితులు మరికొందరూ వైద్యరంగంలో పైచదువుల కోసం విదేశాలకు వెళ్లి చదువుకొని, నైపుణ్యం సంపాదించుకొచ్చాం. మావైద్య సేవలు మనదేశ ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఈ ఎ టు జడ్ హాస్పిటల్ నిర్మించాం. అన్ని వ్యాధులకూ ఒకే చోట చికిత్స చేసే ఏకైక హాస్పిటల్‌గా రూపొందించాం".

"రోగులకు 24 గంటలూ వైద్యసేవలు అందించడానికి హాస్పిటల్ ఆవరణలోనే డాక్టర్లకు, నర్సులకు, ఇతర సిబ్బందికి వసతి కల్పించాం. రోగులకు అన్ని సౌకర్యాలతో ప్రత్యేక గదులున్నాయి. వారి అవసరాలకోసం క్యాంటీన్, మెడికల్, జనరల్‌గూడ్స్ షాపులు ఏర్పాటుచేశాం. విదేశీ వైద్య పరికరాలు సమకూర్చాం. రోగి వివరాలను కంప్యూటర్లో ఉంచుతాం" అంటూ హాస్పిటల్ వివరాలను, తన ఆశయాలనూ వివరంగా చెప్పాడు.

వచ్చినవారంతా హాస్పిటల్‌లోని సదుపాయాలను, పరికరాలనూ కళ్లారా చూసి ఎంతో తృప్తి చెందారు.

ధనుంజయరావు గొప్ప పారిశ్రామికవేత్త. అతను వ్యాపారంలో కోట్లు గడించాడు. అతని




కోకిలమ్ సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో డా॥ ఎ.ఎస్. రావు నగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆగస్టు 28న జరిగిన సభలో పులిగడ్డ విశ్వనాథరావు రచించిన హాస్య రచనల సంపుటి 'తాడు-బొంగరం' ని ప్రసిద్ధ కవి డా॥ అద్దేపల్లి రామమోహనరావు ఆవిష్కరించారు. చిత్రంలో సభాధ్యక్షులు కథా రుషి మునిపల్లె రాజు, ప్రముఖ రచయిత్రి డా॥ ముక్తేవి భారతి, పులిగడ్డ విశ్వనాథరావు ఉన్నారు.

ఏకైక కూతురు రాధికను మేనల్లుడు నంద గోపాల్‌కిచ్చి పెళ్లి చేసాడు. తన వ్యాపారాలన్నీ కూతురికి, అల్లుడికీ ఇచ్చివేసి తాను విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. అయితే నందగోపాల్ వైద్యవృత్తిని చేపట్టాడు.

ధనంజయరావు కాదనలేకపోయాడు. అల్లుడి కోరిక మేరకు కోట్లు వెచ్చించి హాస్పిటల్ కట్టించి అవసరమైన విదేశీ పరికరాలు తెప్పించాడు. హాస్పిటల్ స్టాఫ్ అందరికీ క్వార్టర్స్ ఏర్పాటు చేసాడు.

ఎ టు జడ్ హాస్పిటల్ ఊరి చివర నిర్మించబడింది. అది కేవలం ధనవంతులకోసం ఏర్పాటు చేయబడింది. అందులో చికిత్స కోసం వెళ్లే వారంతా ఏదో విహారయాత్రకు వెళ్లినట్టు అన్పిస్తుంది. అంత ఆహ్లాదకరంగా ఉంటుంది అక్కడి వాతావరణం. ఒకసారి చికిత్స కోసం వెళ్లిన వారు విశ్రాంతి కోసం మరలా ఏదో నెపంతో అక్కడికి వెళ్లి ఒకటి రెండు రోజులు వుండి పరీక్ష చేయించుకుంటున్నారు.

స్వల్పకాలంలోనే ఎ టు జడ్ హాస్పిటల్ పేరు దేశమంతా మారుమ్రోగింది. దాంతో రద్దీ పెరిగింది. పై ఊర్లనుండి వచ్చేవారు నెలరోజులు ముందు రిజర్వ్ చేసుకోవాల్సి వస్తోంది. రోగుల కొరకు నిర్మించిన గదులు చాలటం లేదు. విషయం తెలుసుకొని ధనంజయరావు వెంటనే మరికొన్ని గదులు నిర్మించాలనుకున్నాడు. అందుకు నందగోపాల్ అంగీకరించ లేదు.

"కేవలం గదులు నిర్మించినంతమాత్రాన సమస్య తీరిపోదు. అందుకు అదనంగా వైద్య సిబ్బంది కూడా కావాలి! ఇప్పుడున్న సర్జన్స్, డాక్టర్స్, నర్సులకు చేతినిండా పని ఉంది. గుడ్‌విల్ పాడుచేసుకోవడం నాకు ఇష్టం లేదు" అన్నాడు.

అల్లుడి మాట కాదనలేకపోయాడు ధనంజయరావు.

*　　*　　*

భర్త చనిపోయేనాటికి సీతాలు వయస్సు 30 సంవత్సరాలు. ఆమె చిన్నప్పుడు గ్రామంలోని స్కూల్లో 5వ తరగతి వరకూ చదివింది. ఆమెకు నాలుగేళ్ల కొడుకు, ముసలి అత్త మాత్రమే వున్నారు.

భర్త చనిపోయాడన్న దిగులుతో అధైర్య పడలేదు సీతాలు. భర్త తోపుడు బండినే తన జీవనాధారంగా చేసుకుంది. ఆమె ధైర్యసాహసాలు, నీతి నిజాయితీ, మంచితనం, నమ్మకం మొదలైన గుణాలను మెచ్చుకొని గ్రామవాసులు, పట్నం వర్తకులు చేయూతనిచ్చి ఆదుకున్నారు. తమ సరుకు రవాణా ఆమె తోపుడు బండి ద్వారానే సాగిస్తున్నారు.

ఒక రోజు సీతాలు తోపుడు బండిమీద సరుకు పట్నం మార్కెట్‌లో ఇచ్చి తిరుగు ప్రయాణమైంది. ఊరి చివరకు వచ్చేసరికి చిన్న చినుకులు పడసాగాయి. దాంతో సీతాలు తోపుడు బండిని జోరుగా నెట్టుకుంటూ వెళ్తోంది. చినుకులు పెద్దవయ్యేలోపల గ్రామం చేరుకోవాలని ఆమె తాపత్రయం.

అంతలో ఆమె చూస్తుండగానే రోడ్డు వారగా పరుగులాంటి నడకతో వస్తున్న వ్యక్తిని వెనక నుంచి వచ్చిన మోటార్‌సైకిల్ గుద్దేసి, ఆగకుండా ముందుకు వెళ్లిపోయింది.

ఆ వ్యక్తి రోడ్డుమీద మూడు పల్టీలు కొట్టి గిలగిలా కొట్టుకుంటున్నాడు. సీతాలు చప్పున అతని వద్దకు వెళ్లింది. అతను ఎదురుగా ఉన్న ఎ టు జడ్ హాస్పిటల్‌కి తనను తీసుక

వెళ్లమని చెప్పి, తెలివితప్పి పడిపోయాడు.

సీతాలు చుట్టూ చూసింది. కనుచూపుమేర ఎవరూ లేరు. ఒంటి నిండా గాయాలు, బురద కొట్టుకొని వున్న అతడిని వెంటనే తన తోపుడు బండి మీదకి చేర్చి ఎ టు జడ్ హాస్పిటల్‌కి బండిని నెట్టుకుంటూ బయల్దేరింది.

హాస్పిటల్ గేటు పాతిక గజాలు ఉందనగా ధనంజయ రావుగారి కారు గేటు వద్దకు వచ్చి ఆగింది.

ధనంజయరావు సెక్యూరిటీ గార్డుని పిలిచి, ఏదో చెప్పి కారులో వెళ్లిపోయాడు. సెక్యూరిటీ గార్డు పెద్దగా కేకలు వేస్తూ దూరంనుండే పొమ్మని కసిరి "ప్రభుత్వ ధర్మాసుపత్రికి తీసుకు వెళ్లు" అని గేటు మూసివేసాడు.

సీతాలు గట్టిగా అరిచి ఏదో చెప్పబోయింది. కానీ అతను వినలేదు. ప్రభుత్వ ఆసుపత్రి అక్కడికి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఆలస్యం చేస్తే అతని ప్రాణానికి ముప్పు వస్తుందేమో అనే భయంతో సీతాలు చినుకుల్ని లెక్క చెయ్యక తోపుడు బండిని జోరుగా నెట్టుకుంటూ ప్రభుత్వ ధర్మాసుపత్రికి బయల్దేరింది.

* * *

డాక్టర్ నందగోపాల్ అతని మిత్రుని కారులో అతనితో కలిసి విమానాశ్రయం నుంచి తిరిగి వస్తూండగా కారు టైర్ పంచర్ అయింది. స్టెఫినీలో గాలి లేదు.

"గోపాల్ వర్షం వచ్చేలా వుంది! నీ హాస్పిటల్ అరకిలోమీటర్ దూరంలోనే వుంది కదా! నువ్వు నడిచి వెళ్లిపో! ఏదైనా బండి దొరుకుతుందేమో చూస్తాను ఊర్లోకి వెళ్లడానికి! లేకుంటే కాస్సేపు చూసి ఫోన్ చేస్తాను. నీ కారు డ్రైవర్ని పంపించుదువుగాని" అన్నాడు గోపాల్ స్నేహితుడు.

నందగోపాల్ 'సరే'నని బయల్దేరి నాలుగు అడుగులు వేసేసరికి చిన్న చినుకులు పడసాగాయి. అది గమనించి నందగోపాల్ నడక వేగం పెంచాడు. హాస్పిటల్ కొద్దిదూరంలో ఉందనగా యీ ఘోరం జరిగింది.

సీతాలు ప్రభుత్వ హాస్పిటల్ చేరేసరికి అక్కడి సిబ్బంది డాక్టర్ నందగోపాల్‌ని గుర్తించారు. అతన్ని వెంటనే లోనికి తీసుకువెళ్లి చికిత్స ప్రారంభించారు.

ధనంజయరావుగారికి, ఎ టు జడ్ హాస్పిటల్‌కీ ఫోన్ చేసి విషయం చెప్పారు.


ధనంజయరావుగారు, అతని కూతురు రాధిక, ఎ టు జడ్ హాస్పిటల్ డాక్టర్స్ వెంటనే బయల్దేరి వచ్చారు.

"సమయస్ఫూర్తితో ఆమె వర్షాన్ని లెక్కచేయక తన తోపుడు బండి మీద వేసుకుని తీసుకువచ్చింది కనుక వెంటనే చికిత్స ప్రారంభించగలిగాం. ఇంకో 5 నిమిషాలు లేటయితే ప్రాణం దక్కేది కాదు" అన్నారు డాక్టర్లు.

"తోపుడు బండిమీదా...! ఎక్కడి నుంచి?" అని అడిగారు ధనంజయరావుగారు.

"అవునండీ... తోపుడు బండి మీదే తీసుకొని వచ్చిందామె! మీ హాస్పిటల్ ఎదుటే ఈ ప్రమాదం జరిగిందట! ఎవరో వెనుక నుంచి మోటర్‌సైకిల్‌తో గుద్ది పారిపోయాడట. ఆమెతో తనను ఎ టు జడ్ హాస్పిటల్‌కి తీసుకు వెళ్లమని చెప్పి తెలివి తప్పిపోయాడట డాక్టర్ గోపాల్."

"ఆమె మానవతా దృక్పథంతో అతడ్ని తన తోపుడు బండి మీదకు చేర్చి మీ ఎ టు జడ్ హాస్పిటల్‌కి తీసుకువెళ్తే అక్కడి సెక్యూరిటీ గార్డ్ ఆమె చెప్పబోయేది వినిపించుకోకుండా కసిరి




పొమ్మని గేటు మూసివేసారట! చేసేదిలేక ఆమె వర్షంలో తడుస్తూ తోపుడు బండిని ఇంతదూరం నెట్టుకుంటూ వచ్చింది!" అని చెప్పారు. సీతాలు ద్వారా తాము విన్న విషయాన్ని డాక్టర్లు.

ధనంజయరావు గారికి అప్పుడు గుర్తొచ్చింది. కొద్దిసేపటిక్రితం తోపుడుబండిని ఒకామె నెట్టుకుంటూరావడం, అది చూసి తను సెక్యూరిటీ గార్డుకు చెప్పి ఆమెను తరిమివేయడం వగైరా. అదే విషయం కూతురితో చెప్పాడు గిల్టీగా ఫీలవుతూ.

"నా భర్తప్రాణం కాపాడిన ఆ దేవత ఏది? ఎక్కడుంది డాక్టర్?" అంది రాధిక.

"ఇక్కడే వుందమ్మా! వర్షందా వుందని పోర్టికోలోనే నిల్చుంది! రండి చూపిస్తాను" అన్నాడు డాక్టర్.

ధనంజయరావు, రాధిక డాక్టర్ వెంట వెళ్లారు.

"నా భర్త ప్రాణం కాపాడిన ఆ దేవతకు యిప్పుడే 'నిలువు దోపిడీ' యిస్తాను డాడీ!" అంది రాధిక బొంగురు పోయిన గొంతుకతో.

'సరేనమ్మా!' అన్నారు ధనంజయరావు గారు కూతురి సెంటిమెంట్‌ని గ్రహించి. కూతురి మాట ఏ విషయంలోనూ ఎన్నడూ కాదనలేదు ఆయన. అదీకాక అతనికది లెక్కే కాదు.

పోర్టికోలో తోపుడు బండిప్రక్కన నిల్చున్న సీతాలుని చూపించి "ఈమేనమ్మా నీ భర్త ప్రాణాలు కాపాడింది" అన్నాడు డాక్టర్.

సీతాలుని చూడగానే గతం గుర్తుకు వచ్చింది రాధికకు.

లోగడ తాను నిర్లక్ష్యంగా కారు నడిపి, ఏ వ్యక్తి పసుపు కుంకాలు తుడిచి వేసి, నడిరోడ్డు మీద నిస్సహాయ స్థితిలో విడిచి పారిపోయిందో... ఆ వ్యక్తే యీనాడు తన భర్త ప్రాణాలు కాపాడి, తన పసుపు కుంకుమలు నిలిపిన దేవతగా కంట పడేసరికి తట్టుకోలేక రాధిక తెలివితప్పి పడిపోయింది.

వర్షం తగ్గడంతో ఇదేమీ గమనించకుండానే సీతాలు తోపుడు బండిని నెట్టుకుంటూ ముందుకు సాగిపోయింది. ●